క్లుప్తంగా

ఘనంగా డాక్టర్ పరాంకుశం సత్యన్నారాయణాచార్యుల వర్ధంతి


నివాళులర్పిస్తున్న బంధుమిత్రులు

ఒంగోలు: స్థానిక ఘోషా హాస్పిటల్ ఆయుర్వేద వైద్యుడు పరాంకుశం సత్యన్నారాయణాచార్యులు ద్వితీయ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక పేర్నమిట్టలోని ఆయన నివాసంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మిత్రులు, ఆత్మీయులు, బంధువులు పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

చప్పిడి వెంగళరావుకు డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న చప్పిడి వెంగళరావు

ఒంగోలు: విద్యార్థి దశ నుంచి సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ నాలుగు దశాబ్దాలుగా అంబేడ్కర్ ఆలోచనలు, ఆశయాలతో ముందుకు సాగుతున్న దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు హెచ్ఎస్సీ యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఎస్సీ నేషనల్ క్యాంపస్ ఆడిటోరియం ప్రేయర్ హాలులో డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ఆయనకు దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ కార్యదర్శి టి.రాజేంద్ర, పీవీ రావు మాలమహానాడు రాష్ట్ర కన్వీనర్ దారా అంజయ్య, మాలభేరి యువజన విభాగం అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి ప్రీతం, మాల యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొందుగుల చైతన్య తదితరులు అభినందనలు తెలిపారు.

వైభవంగా సంస్కృతి దీక్ష యజ్ఞం


చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

త్రిపురాంతకం: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సంస్కృతి దీక్ష యజ్ఞం శ్రీకార్యసిద్ధి గణపతి మందిరం చండీ మాత వద్ద చండీ హోమం భక్తజనులచే పండితులు శుక్రవారం నిర్వహించారు. త్రిపురాంతకం ఆలయం వద్ద జరిగిన ప్రత్యేక పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పండితులు విశ్వం, వెంకట సుబ్బయ్య, రవిస్వామి హోమం, ప్రత్యేక పూజల అనంతరం ఆశీర్వచనం ప్రసాదాలు, స్వామి అమ్మవార్ల చిత్రపటం అందజేశారు. వీహెచ్‌పీకి చెందిన ప్రముఖులు నర్రా వెంకటరెడ్డి, అంకాలయ్య, బ్రహ్మానందరెడ్డి, గురుస్వామి, సందీప్, వీరారావు, వెంకటరాములు, టి.మల్లారెడ్డి, రాధాకృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, నాగిరెడ్డి, రమణారెడ్డి, వీరపనాయుడు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచిగా, శుచిగా ఉండాలి


మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవోలు

పుల్లలచెరువు: పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం రుచిగా, శుచిగా ఉండాలని ఎంఈవోలు శామ్యూల్‌జాన్, ఇందిరాప్రసాద్ అన్నారు. శుక్రవారం వారు పలు పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందుగా ప్రభుత్వం నిర్దేశించిన మెనూను అమలు చేయాలని, భోజనం రుచిగా, పరిశుభ్రమైన ప్రదేశంలో తయారు చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు భోజనం తయారైన తర్వాత రుచికరంగా ఉంటేనే విద్యార్థులకు అందజేయాలన్నారు. రుచిలో, నాణ్యతలో తేడాలు ఉంటే ఆ పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. పాఠశాలల్లో ముఖ్యంగా విద్యార్థుల సామర్థ్యాలపై దృష్టిపెట్టాలన్నారు.

భక్తిశ్రద్ధలతో నాంచారమ్మ తల్లి తిరునాళ్లు


నాంచారమ్మతల్లి గ్రామోత్సవంలో భారీగా పాల్గొన్న భక్తులు


పులిబిడ్డలు సాంఘిక నాటకంలోని ఓ సన్నివేశం

- ఆలయంలో బారులుదీరిన భక్తులు
- నాంచారమ్మతల్లికి వైభవంగా గ్రామోత్సవం

కొత్తపట్నం: కొత్తపట్నం గ్రామంలో శ్రీ నాంచారమ్మతల్లి బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శుక్రవారం మూడోరోజు ఆలయానికి భక్తులు పోటెత్తారు. రెండు రోజుల నుంచి సంతానం కోసం మహిళలు వరపడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఆచారాలు, సంప్రదాయాల ప్రకారం నాంచారమ్మ తల్లికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ముందు ముగ్గు పోసి పూజలు చేశారు. నాంచారమ్మతల్లికి గజవ్యాళి వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి ఈత ముక్కల రోడ్డు, బస్టాండ్ సెంటర్, పోస్టాఫీస్ బజారు, శివాలయం వీధిలో గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం ఆలయానికి చేరుకున్నారు. అర్ధరాత్రి తర్వాత కె.పల్లెపాలెం గ్రామానికి చేరుకుని చిన్నవాహనంపై శ్రీ నాంచారమ్మతల్లికి గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీ నాంచారమ్మతల్లి దేవస్థానం ఆధ్వర్యంలో 3 భారీ విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. ప్రభలను చూడటానికి తండోపతండాలుగా భక్తులు తరలివచ్చారు. విద్యుత్ ప్రభలపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాక్‌స్టార్ ఈవెంట్స్ ఒంగోలు వారిచే డ్యాన్స్ ప్రదర్శించారు. స్వరసుమాంజలి ఒంగోలు వారిచే పాటకచేరి, డ్యాన్స్ ప్రదర్శించారు. జయశ్రీ ఈవెంట్స్ నరసరావుపేట వారిచే డ్యాన్స్ ప్రదర్శించారు. భారీగా మందుచెట్లు పేల్చారు. భక్తులు నాంచారమ్మతల్లిని అధిక సంఖ్యలో దర్శనం చేసుకున్నారు.

శాకంబరీ అలంకరణలో అమ్మవారు


ఆశీర్వాదం స్వీకరిస్తున్న శిద్దా సుధీర్

చీమకుర్తి: ఆషాడ మాసం సందర్భంగా శుక్రవారం చీమకుర్తి హరిహరక్షేత్రంలో నిర్వహించిన గోరింటాకు పండుగను పురస్కరించుకుని అమ్మవారు శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు శిద్దా సుధీర్‌తో పాటు స్థానిక వాసవీ మహిళల సమక్షంలో అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో సారె సమర్పణ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు కోలాటం ప్రదర్శించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. తొలుత శిద్దా సుధీర్‌తో పాటు లక్ష్మీపద్మావతి హరిహరక్షేత్రంలో సకల దేవతల వద్ద ఆశీర్వాదాలు స్వీకరించారు.

బాధితులను కార్యాలయం చుట్టూ తిప్పుకోకండి

- ఒంగోలు ఆర్డీవో జీవీ సుబ్బారెడ్డి


కొత్తపట్నం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో సుబ్బారెడ్డి

కొత్తపట్నం: బాధితులను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా అర్జీ పెట్టుకున్న మరుక్షణమే పరిష్కరించాలని ఒంగోలు ఆర్డీవో జీవీ సుబ్బారెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కొత్తపట్నం తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరిస్తేనే ఇక్కడ ఉండండి.. లేకపోతే మరోచోటకు మార్చేస్తామని సిబ్బందిని హెచ్చరించారు. ఇక్కడికి దగ్గరలో కాకుండా దోర్నాల, మాచర్ల, కొమరోలు, కురిచేడు వంటి మండలాలకు పంపిస్తామని అన్నారు. రికార్డులు మీ వెంట పెట్టుకుంటే వచ్చిన వెంటనే పనిచేయవచ్చని, రికార్డులో స్పష్టంగా ఉంటేనే పనిచేయాలని చెప్పారు. మీ సేవా కేంద్రం దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని పరిష్కరించాలని, ఇష్టం వచ్చినప్పుడు చేస్తామంటే కుదరదని స్పష్టం చేశారు. అయ్యే పనులను వెంటనే చేయాలని, కాని పనులను కాదని కూడా వెంటనే చెప్పాలని ఆదేశించారు. హాజరు రిజిష్టర్ తప్పనిసరిగా ఉండాలని, సీఎల్, ఓడీ, మెడికల్ లీవ్ అని స్పష్టంగా రాయాలని సూచించారు. పనిచేయకపోతే ఇంక్రిమెంట్లు కట్ అవుతాయని, రెండు ఇంక్రిమెంట్లు పెండింగ్ ఉంటే వారికి జీతం పెట్టవద్దని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అధికారులు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. చెప్పినవన్నీ చేయాలని, వారం రోజుల్లో మళ్లీ తనిఖీ చేస్తానని ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో డీటీ అర్జున్‌రెడ్డి, ఆర్ఐ వరప్రసాద్, ఏఎస్ఓ కోటేశ్వరరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రగడ కోటయ్య జయంతి


ప్రగడ కోటయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న పద్మశాలీయుల సంఘ నాయకులు

చీమకుర్తి: చేనేత బంధుగా పేరుగాంచిన ప్రగడ కోటయ్య జయంతిని పురస్కరించుకుని శుక్రవారం చీమకుర్తిలోని ఆయన విగ్రహానికి పద్మశాలీయుల సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పద్మశాలీయుల సంఘానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం హాస్టల్ విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, గోపురపు చంద్ర, అవ్వారు ఆదినారాయణ, దోమల పుల్లయ్య, సోమా యానాది శెట్టి, మద్రి లక్ష్మీనారాయణ, స్థానికులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా హేమసుందర్


లయన్స్ క్లబ్ అధ్యక్షుడు హేమసుందర్‌ను సత్కరిస్తున్న క్లబ్ నిర్వాహకులు

చీమకుర్తి: చీమకుర్తి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా నూనె హేమసుందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది. సెక్రటరీగా ఎస్.అంజిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా కే వడ్డికాసులు, ఎస్.పున్నారావు, ట్రెజరర్‌గా సీహెచ్ పార్థసారధిని ఎన్నుకున్నారు. 2024–25 సంవత్సరానికిగానూ ఎన్నుకున్న నూతన కమిటీ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీ జవహర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలు ప్రభుత్వ పాఠశాలలకు వంట పాత్రలు, స్కూలు గ్రాంట్లు, నోట్‌పుస్తకాలు అందించారు. తొలుత నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నూనె హేమసుందర్‌ను క్లబ్ సభ్యులతో పాటు కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నిర్వాహకులు విజయకుమార్‌రెడ్డి, చలువాది బదరీనారాయణ, ఆర్.లక్ష్మీనారాయణ, చలువాది రమేష్, స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- ఎస్ఎస్ఏ ఏఎంవో రమేష్‌బాబు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఎస్ఏ ఏఎంవో రమేష్‌బాబు

ఒంగోలు: విద్యార్థులు ప్రస్తుత కాలానికి తగ్గట్లుగా సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సమగ్రశిక్ష అభియాన్ అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.రమేష్‌బాబు సూచించారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సాంకేతిక నైపుణ్యాల దినోత్సవంలో స్థానిక బండ్లమిట్టలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలను శుక్రవారం ఆయన పరిశీలించారు. విద్యార్థులు ప్రదర్శించిన రాకెట్ నమూనా ప్రయోగాన్ని పరిశీలించి అభినందించారు. తరగతి గదులలో ఉన్న ఐఎఫ్‌పీ ప్యానల్‌ను విద్యార్థులు వినియోగించుకునే విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఐఎఫ్‌పీ ప్యానల్‌ను వినియోగించడం ద్వారా అనేక అంశాలను తెలుసుకోవచ్చన్నారు. ఇందులో అన్ని రకాల ఇంటర్‌నెట్ అంశాలను ఉపయోగించుకుని విద్యను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జి.కృష్ణకుమారి, స్టాఫ్ సెక్రటరీ డి.చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ దినోత్సవం


కార్గిల్ అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

ఒంగోలు మెట్రో: వాసవీ క్లబ్ ఒంగోలు అధ్యక్షుడు నల్లమల్లి బద్రీనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఒంగోలు బండ్లమిట్ట మంగలిపాలెం కూడలి వద్ద గల కార్గిల్ విజయస్థూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి కార్గిల్ అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం మన కర్తవ్యమని బద్రీనారాయణ పేర్కొన్నారు. కార్గిల్ విజయ్ దివస్ గురించి వివరించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ రీజియన్ చైర్ పర్సన్ దర్శి మనోహర్ చంద్రశేఖర్, చలువాది సత్యనారాయణ, పబ్బిశెట్టి గోవర్ధన్, చీదెళ్ల వెంకట ప్రసాద్, భూమా శ్రీనివాసరావు, నేరెళ్ల శ్రీనివాసరావు, రాధా రమణగుప్తా జంధ్యం, గుర్రం కృష్ణ, ఇతర క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలి


మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న సుజన్‌మాదిగ, తదితరులు

ఒంగోలు: ల్యాబ్ టెక్నీషియన్ నోటిఫికేషన్‌లో నకిలీ సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖామంత్రి సత్యకుమార్‌కు మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుజన్ మాదిగ, తదితరులు ఫిర్యాదు చేశారు. శుక్రవారం అమరావతిలోని సచివాలయంలో మంత్రిని కలిశారు. 2020లో జరిగిన ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీలో 30 మందికిగానూ 22 మంది తప్పుడు సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగాలు పొందారని ఫిర్యాదు చేశారు. తాము పలుమార్లు సాక్ష్యాధారాలతో సహా ఫిర్యాదుచేయగా, ఒకరిని మాత్రమే విధుల నుంచి తొలగించారని, మిగతా వారిపై చర్యలు తీసుకోకపోవడంలో వైద్యారోగ్యశాఖ అధికారుల పాత్ర కూడా ఉందని వివరించారు. దీనిపై మంత్రి సత్యకుమార్ సానుకూలంగా స్పందించారని, తప్పకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని సుజన్ మాదిగ మీడియాకు తెలిపారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


కరాటే పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

ఒంగోలు: ఇంటర్నేషనల్ కరాటే టోర్నమెంట్‌లో స్థానిక క్విస్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ నెల 21న హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన కరాటే పోటీల్లో క్విస్ స్కూలు విద్యార్థులు శుభశ్రీ దాస్, సీహెచ్ హరినారాయణ, ఎస్‌కే ఖలీద్ గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం స్కూల్లో జరిగిన కార్యక్రమంలో క్విస్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి, వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.గాయత్రీదేవి విద్యార్థులను అభినందించారు. క్విస్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ మేరి, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

108లో గర్భిణి ప్రసవం


108లో ప్రసవించిన ఆదిలక్ష్మి

పుల్లలచెరువు: 108లో పండంటి మగబిడ్డకు జన్మనించింది ఓ తల్లి. మండలంలోని మానేపల్లి గ్రామానికి చెందిన తమటం ఆదిలక్ష్మి (27) ప్రసవ వేదన ఎక్కువగా ఉండటంతో భర్త కోటిరెడ్డి 108 వాహనానికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. స్పందించిన 108 సిబ్బంది మానేపల్లి వచ్చి గర్భిణిని ఎక్కించుకుని సమీపంలోని త్రిపురాంతకం వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించారు. వైద్య సిబ్బంది మెరుగైన వైద్యం కోసం ఏరియా వైద్యశాల ఉన్న యర్రగొండపాలేనికి రిఫర్ చేయడంతో వారు అక్కడి నుంచి బయల్దేరారు. కొంతదూరం వచ్చేసరికి నొప్పులు ఎక్కువ కావడంతో టెక్నీషియన్ గాలిరెడ్డి, పైలట్ శ్రీను అంబులెన్స్‌లోనే సుఖప్రసవం చేయించారు. పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది ఆదిలక్ష్మి. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు 108 సిబ్బందికి అభినందనలు తెలిపారు.

నగరంలో పోలీసుల విస్తృత తనిఖీలు


వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్సై బాబూరావు

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు నగరంలో శుక్రవారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపవద్దని ద్విచక్ర వాహనదారులను హెచ్చరించారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు నగరంలోని వన్‌టౌన్, టూటౌన్, తాలూకా పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు బాబూరావు, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరెడ్డి వారి సిబ్బందితో మూడు బృందాలుగా ఏర్పడి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. త్రోవగుంట, కిమ్స్, రిమ్స్, కొత్తపట్నం బస్టాండ్ తదితర ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేపట్టారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారికి తమదైన శైలిలో కౌన్సిలింగ్ ఇచ్చారు.

కౌలు రైతులకు బ్యాంకులో రుణాలివ్వాలి


మేనేజర్‌కు కౌలు రైతుల జాబితా అందిస్తున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దారవీడు: కౌలు రైతులకు సాగు చేసిన పంటలపై బ్యాంకుల్లో రుణాలు మంజూరు చేయాలని ఏఓ కె.బుజ్జిబాయి తెలిపారు. మండలంలో గొబ్బూరు, దేవరాజుగట్టు గ్రామాల కౌలు రైతుల జాబితాను దేవరాజుగట్టులో కెనరా బ్యాంక్ మేనేజర్‌కు శుక్రవారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత కలిగిన కౌలు రైతులకు సీసీఆర్‌సీతో ప్రభుత్వం ద్వారా రాయితీ, నష్టపరిహారం, బ్యాంకు రుణాలు వంటివి ఎంతో ప్రయోజనాలు వర్తిస్తాయన్నారు. సొంత భూమి లేని రైతులు తోటి రైతుల నుంచి కౌలుకు తీసుకున్న వారికి 11 నెలలు అగ్రిమెంట్‌తో సీసీఆర్‌సీ ఇస్తామన్నారు. సొంత భూమి సాగుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అర్హులైన కౌలు రైతులందరికీ సాగు పత్రాలు అందించి, ప్రభుత్వ పథకాల ద్వారా కలిగే లబ్ధి వర్తించేలా కృషి చేస్తామన్నారు.